



WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 15 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 191 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY AUGUST 15 2026 | VOL:18 | ISSUE: 191 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## తమిళనాడు ప్రభుత్వం, సీఎం విజయ్‌కి సుప్రీంకోర్టులో బిగ్ రిలీఫ్!

- కరూర్ తొక్కిసలాట ఘటనలో పలువురి మృతి
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని విజయ్ ప్రభుత్వ నిర్ణయం
- ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పు
- హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సుప్రీంకోర్టు



(మిగతా 2వ పేజీలో..)

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణిపై గవర్నర్‌కు ఫిర్యాదు!

హైదరాబాద్ : రాష్ట్ర రాజకీయాల్లో సంచలన ఘటన చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినిపై ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. విశ్రాంత ఉద్యోగుల బకాయిల విడుదలకు ఆమె కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై అంబర్ పేట న్యాయవాది, సామాజిక కార్యకర్త రేవంత్, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. దీనిపై పకడ్బందీగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. నందిని రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి చూపుతున్నారని, అయితే గతంలో ఎంపీ టికెట్ ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు.



# కేబినెట్ కీలక నిర్ణయాలు..
# సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీకి నిర్ణయం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2.0కు ఆమోదం
- ఏడు రకాల సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్
- 18,766 ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్ల పథకం
- మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2కు రూ.2,100 కోట్లు
- ఏడు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు అనుమతి



హైదరాబాద్: రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి

(మిగతా 2వ పేజీలో..)

## 'ఇంకా ఎప్పుడు ఎదుగుతావ్ రాహుల్?'.. కాంగ్రెస్ అగ్రనేత 'హగ్' జోక్‌పై బీజేపీ ఫైర్

- మోదీ విదేశాంగ విధానం 'ఆలింగనాలకే' పరిమితమైందన్న రాహుల్
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర విమర్శలు
- రాహుల్ వ్యాఖ్యలు రాజకీయ చర్చ స్థాయిని దిగజార్చాయన్న బీజేపీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాంగ విధానాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. రాహుల్ గాంధీ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిగా వ్యవహరించాల్సిన తీరును మరిచిపోయారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు.



(మిగతా 2వ పేజీలో..)

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోట సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపు.. హై అలర్ట్

దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరి ంచారు. ఆగస్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగస్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు.

(మిగతా 2వ పేజీలో..)



## పార్లమెంట్ సెషన్‌లో ఎదురుదెబ్బ.. దిద్దుబాటు చర్యల్లో మోదీ సర్కార్!

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎఫ్‌సీఆర్ఏ, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ వంటి కీలక బిల్లుల విషయంలో ముందుకు వెళ్లలేకపోవడంతో బీజేపీ నాయకత్వం ఆత్మరక్షణలో పడినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు దిగిన ప్రధాని మోదీ, త్వరలో పార్టీలోనూ, కేంద్ర కేబినెట్‌లోనూ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది. విదేశీ

(మిగతా 2వ పేజీలో..)



## రాహుల్ గాంధీకి భారీ ఊరట.. సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం



- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు
- ప్రభుత్వ అనుమతి తీసుకోలేదంటూ కేసును కొట్టివేసిన సుప్రీంకోర్టు

సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును

(మిగతా 2వ పేజీలో..)

## నాకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయమా? అధికారులపై డీకే శివకుమార్ ఫైర్.. గుట్కా నిషేధంపై యూటర్న్

- గుట్కా నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కర్ణాటక ప్రభుత్వం యోచన
- తనకు తెలియకుండా ఉత్తర్వులు జారీ చేయడంపై అధికారులపై సీఎం శివకుమార్ ఆగ్రహం
- ప్రభుత్వ నిర్ణయంతో గుట్కా కొనుగోలుకు ఎగబడుతున్న వినియోగదారులు

కర్ణాటకలో గుట్కా నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం వెనక్కి తగ్గేందుకు సిద్ధమైంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని వక్క (అడక) రైతులు తీవ్రంగా

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోట సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపు.. హై అలర్ట్

మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు. సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు. జామ్‌నగర్ హౌజ్, ఝుండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింతకట్టుదిట్టం చేశారు. శనివారం, ఆగష్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకల కోసం ఢిల్లీ నగరంలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వేడుకల కోసం మండి హౌజ్ మెట్రో స్టేషన్, ఐటీవో బిల్డింగులను అందంగా అలంకరించారు.

## తమిళనాడు ప్రభుత్వం, సీఎం విజయ్‌కి సుప్రీంకోర్టులో బిగ్ రిలీఫ్!

మొదటి పేజీ తరువాయి)

తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తాజాగా స్టే విధిస్తూ కీలక ఆదేశాలు ఇచ్చింది.మద్రాస్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ... ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను ప్రశ్నించడానికి పిటిషనర్లకు గల హక్కును నిలదీసింది. దారుణమైన ఘటనలో కుటుంబానికి ఆసరాగా ఉండే ఏకైక వ్యక్తి చనిపోయినప్పుడు, వారి పిల్లలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడంలో ఎలాంటి తప్పు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ స్టే ఉత్తర్వులతో బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు అందించే ప్రక్రియకు మళ్లీ మార్గం సుగమమైంది, ఇది ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వానికి పెద్ద ఊరటగా నిలిచింది.

## 'ఇంకా ఎప్పుడు ఎదుగుతావ్ రాహుల్?'.. కాంగ్రెస్ అగ్రనేత 'హగ్' జోక్‌పై బీజేపీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

గురువారం నిర్వహించిన కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. విదేశాంగ విధానంపై ప్రధాని మోదీకి ఉన్న అవగాహన విదేశీ నేతలను ఆలింగనం చేసుకోవడానికే పరిమితమైందన్నట్లుగా వ్యాఖ్యానించారు. వేదికపైనే కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను ఆలింగనం చేసుకుని తన వ్యాఖ్యలను హాస్యంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను 'జోకర్ల గుంపు'గా కూడా అభివర్ణించారు.ఈ వ్యాఖ్యలపై ప్రహ్లాద్ జోషి తీవ్రంగా స్పందించారు. "రాహుల్ గాంధీ.. ఎప్పుడు ఎదుగుతారు?" అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. దేశాన్ని నడిపించడానికి పరిణతి చెందిన నాయకత్వం అవసరమని, 'జోకర్స్, క్లౌన్స్' వంటి పదాలు ఉపయోగించడం ఆయన రాజకీయ అపరిపక్వతను చూపిస్తోందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలు ఎన్నుకున్న నాయకుడని జోషి పేర్కొన్నారు. కుటుంబ వారసత్వం ద్వారా మోదీ ప్రధాని కాలేదని, రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రధానిని మాత్రమే కాకుండా దేశ ప్రజలను కూడా అవమానించేలా ఉన్నాయని విమర్శించారు.కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలు హద్దులు దాటుతున్నాయని అన్నారు. రాహుల్ ప్రవర్తనపై సోనియా గాంధీ జోక్యం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ కూడా రాహుల్ గాంధీపై మండిపడ్డారు. ప్రధాని మోదీపై ఆయన ఉపయోగించిన భాష లోక్‌సభ ప్రతిపక్ష నేత హోదాకు తగదన్నారు. దేశానికి నిర్మాణాత్మక ప్రతిపక్షం అవసరమని, సోషల్ మీడియా మీమ్స్, రీల్స్ కోసం చౌకబారు వ్యాఖ్యలు చేసే తీరు కాదని విమర్శించారు. కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ సైతం రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ చర్చ స్థాయిని మరింత దిగజార్చాయని పేర్కొన్నారు.

## పార్లమెంట్ సెషన్‌లో ఎదురుదెబ్బ.. దిద్దుబాటు చర్యల్లో మోదీ సర్కార్!

విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అంతర్జాతీయంగానూ ఒత్తిడి రావడంతో కేంద్రం ఈ బిల్లును ప్రస్తుతానికి పక్కనపెట్టినట్టు సమాచారం. మరోవైపు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేయడంతో, ఈ బిల్లుకు పరోక్షంగా మద్దతివ్వాలనుకున్న డీఎంకే కూడా పునరాలోచనలో పడింది. ఇది కూడా కేంద్రానికి ప్రతికూలంగా మారింది.కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలతో ప్రతిపక్షాలు మరింత బలం పుంజుకుని ఉభయ సభలను స్తంభింపజేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు రాకపోవడం, ప్రధాని మోదీ తన కార్యాలయానికే పరిమితం కావడంతో బీజేపీ ఆత్మరక్షణలో పడిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రతిపక్షాల దాడి సమయంలో కొందరు విధేయులైన ఎంపీలు మినహా, పార్టీ సీనియర్ నేతలు మౌనంగా ఉండటం కూడా మోదీ శిబిరంలో కలవరం రేపినట్టు తెలుస్తోంది.ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకుని, తిరిగి బలం పుంజుకునేందుకు ప్రధాని మోదీ రాబోయే మూడు నెలల్లో కీలక చర్యలు చేపట్టనున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌పై మోదీ, అమిత్ షా పూర్తి దృష్టి సారించారు. ఈ దిశగానే పార్టీ, కేబినెట్‌లో మార్పులు ఉండబోతున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. త్వరలోనే యూపీలో భారీ ఎత్తున ఎన్డీఏ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెలాఖరులోపు పార్టీపరమైన మార్పులు, చేర్పులు ప్రకటించడంతో పాటు, కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయనున్నారని తెలుస్తోంది. అదే సమయంలో, పార్టీలో కొంతకాలంగా దూరంగా ఉంటున్న సీనియర్ నేతలను సైతం తిరిగి విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, అహ్లూవాలియా వంటి నేతలతో ప్రధాని చర్చలు జరిపినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

# కేబినెట్ కీలక నిర్ణయాలు.. సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

మొదటి పేజీ తరువాయి)

అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.గత ఏడాది నిర్వహించినట్లే.. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాథమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది తెలంగాణ రైజింగ్-2047 విజన్ను ఆవిష్కరించినట్లే.. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్ తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించనుంది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్ లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్లో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి.. హైదరాబాద్ ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలుగా) మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు.హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన ఎ××ూ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు కేబినెట్ నిర్ణయం. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించింది.మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-×× పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది.గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది

## నాకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయమా? అధికారులపై డీకే శివకుమార్ ఫైర్.. గుట్కా నిషేధంపై యూటర్న్

మొదటి పేజీ తరువాయి)

నష్టపోతారని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. గుట్కా నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి.గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై తీవ్ర చర్చ జరిగినట్లు సమాచారం. ఇంతటి కీలకమైన నిర్ణయం తన దృష్టికి రాకుండా ఎలా జారీ చేశారని సీఎం అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు జారీ చేసే ముందు తనతో ఎందుకు చర్చించలేదని నిలదీశారు. రాష్ట్రంలోని ఏడెనిమిది జిల్లాల్లో రైతులు పూర్తిగా వక్క సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఆయన గుర్తుచేశారు.అంతకుముందు కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి గుట్కా నిషేధం వల్ల వక్క రైతులకు జరిగే నష్టంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం గురించి తనకు తెలియదని, సమస్యను పరిష్కరిస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు. తమతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ పరిణామంపై మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ బసవరాజ్ బొమ్మై స్పందిస్తూ.. ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాల మధ్య ప్రభుత్వం సమతుల్యం పాటించాలని సూచించారు. "ఆరోగ్యం ముఖ్యమే, కానీ వక్క రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒకప్పుడు మల్నాడు ప్రాంతానికే పరిమితమైన వక్క సాగు, ఇప్పుడు రాష్ట్రంలోని చాలా జిల్లాలకు విస్తరించింది. రైతులు ఐదేళ్ల పాటు పెట్టుబడి పెట్టి పంట కోసం ఎదురుచూస్తారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు వారిని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఒకవేళ నిషేధం అమలు చేయాలనుకుంటే రైతులకు నష్టపరిహారం అందించాలి" అని ఆయన డిమాండ్ చేశారు.వక్క రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే, ముఖ్యంగా మల్నాడు ప్రాంతంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని జేడీఎస్ ఎమ్మెల్యే ఎ. మంజు హెచ్చరించారు. "రైతుల ఆందోళనలకు మేం మద్దతిస్తాం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని ఆయన కోరారు. మరోవైపు, గుట్కా నిషేధం వార్తలతో వినియోగదారులు ఆందోళనకు గురై, పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కొందరైతే బస్తాల్లో గుట్కా ప్యాకెట్లను తీసుకెళుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ వివాదం నేపథ్యంలో, ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## రాహుల్ గాంధీకి భారీ ఊరట.. సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

మొదటి పేజీ తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది.జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది.2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు.ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు.దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది.అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

ఆగస్టు । శనివారం । 15 । 2026

విజయకెరటం
తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్



# భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



- **మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం -- బాధితులకు సత్వర న్యాయం, అండగా నిలవాలి .**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఆగస్టు 14 . విజయ కెరటం.**

మహిళలు, బాలికలు మరియు చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ నల్గొండలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.భరోసా కేంద్రంలోని కౌన్సెలింగ్ గదులు, బాధితులకు అందిస్తున్న సహాయ సేవలు, కేసుల నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు.బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు , చిన్నారుల పట్ల సానుభూతి, గోప్యత, గౌరవంతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన పోలీస్, వైద్య, న్యాయ , మానసిక సహాయాన్ని సత్వరమే అందించాలని సూచించారు.బాలలపై లైంగిక నేరాల కేసుల్లో బాధిత చిన్నారుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని చైల్డ్ ఫ్రెండ్లీ విధానంలో విచారణ, కౌన్సెలింగ్ , ఇతర సహాయ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత పోలీస్ అధికారులు, వైద్య, న్యాయ , ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు నిరంతరం సహకారం అందించాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు.భరోసా కేంద్రం బాధితులకు "అండగా నిలిచే కేంద్రంగా" పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ పేర్కొన్నారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్ఐ అమీన్, ఎస్ఐ గౌస్, ఏఎస్ఐ అబేదా, శ్రీనివాస్, భరోసా కేంద్రం కోర్డినేటర్ నళిని,సిబ్బంది, సంబంధిత పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించాలి- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్లగొండ ఆగస్టు 14 విజయ కెరటం ప్రతినిధి**

ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు, ప్రత్యేక అధికారులు హాజరు కావాలన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, , తహసీల్దార్లు,ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాలపై సమీక్షించారు.ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని ,ప్రజల నుండి స్వీకరించిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజుల్లోగా పరిష్కరించాలని,ప్రజావాణికి వచ్చే ప్రతి వ్యక్తి సమస్యను అధికారులు ఓపికగా విని అర్థం చేసుకోవాలని, ప్రజల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజావాణిలో పాల్గొనని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టెంట్లు, టేబుల్లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రజావాణి ముగిసిన తర్వాత అధికారులు సమీక్ష నిర్వహించి, ఆ వారం వచ్చిన దరఖాస్తులపై శాఖల వారీగా చర్చించి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో సర్పంచులకు కూడా సమాచారం అందించాలని సూచించారు.మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ,శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులను సమీక్షించి ప్రజలకు సరైన సమాధానం ఇవ్వాలని, అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని అందిస్తూ సమస్య పరిష్కారమయ్యే వరకు బాధ్యతగా వ్యవహరించాలని,ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని,మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి సంబంధించి సాంకేతికంగా అందరూ అనుసంధానం అయ్యేలా మొబైల్ లింక్ ఏర్పాటు చేయాలని, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులు లింక్‌ను ఓపెన్ చేసుకొని కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలే ప్రభుత్వానికి ముఖ్యమని, వారి సమస్యలను పరిష్కరించడమే అధికారుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించి, ప్రజలు సులభంగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.వర్షాలు వచ్చినచోట వనమహోత్సవం కింద విస్తృతంగా మొక్కలు నాటాలని, కొన్ని ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నందున సద్వినియోగం చేసుకొని విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు

## విద్యార్థులు చదువులో రాణించి ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలి.

**ప్రభుత్వ విప్. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఏప్రిల్ 14. విజయ కెరటం.**




నకిరేకల్ పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు .ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే వేముల వీరేశం, విద్యార్థులను వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువులో రాణించి ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం వంటి పథకాల ద్వారా విద్యను అందరికీ చేరవేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు ,వివిధ పోటీ పరీక్షల్లో పోటీ పడాలి కలెక్టర్

**నల్లగొండ ఆగస్టు 14 విజయ కెరటం ప్రతినిధి**




శుక్రవారం కలెక్టర్ బి చంద్రశేఖర్ గారు నల్గొండ లోని బొట్టుగూడ ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫార్మ్స్ ,నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 8 వ తరగతి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 8 వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్ మెరిటోరియస్ స్కాలర్షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్ ) పరీక్షకు హాజరు కావాలని, ఇందుకు కష్టపడి చదవాలని సూచించారు. మెరిటోరియస్ స్కాలర్షిప్ పరీక్ష ఉత్తీర్ణులైతే 8వ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం 12000 రూపాయల ఉపకార వేతనం విద్యార్థులకు వస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంవత్సరం డిసెంబర్ మొదటి వారంలో ఈ పరీక్ష ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1200 మంది విద్యార్థులకు ఈ మెరిటేరియస్ స్కాలర్షిప్ వచ్చే అవకాశం ఉందని, అందువల్ల జిల్లాలోని విద్యార్థులు బాగా చదవాలన్నారు. ఈ పరీక్షకు హాజరు కావడం వల్ల ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు మంచి అవకాశమని, దీనిని స్ఫూర్తి గా తీసుకొని ఇతర పోటీ పరీక్షలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, యూనిఫామ్స్, ఐడి కార్డ్స్ జాగ్రత్తగా ఉంచుకోవాలని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనా రెడ్డి, ఎంఈఓ అరుంధతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పడాల సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు .

## డంపింగ్ యార్డ్ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలి

**అంకిరెడ్డిగూడెం గ్రామ ప్రజల ర్యాలీ, ధర్నా**

**చౌటుప్పల్, ఆగస్టు 14 ( విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్)**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ సర్వే నంబర్ 326లో, స్మశానవాటిక సమీపంలో కాంశెట్టి పెంటయ్య బావి నుండి బిస్కెట్ కంపెనీ వెనుక భాగం వరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల నుండి సేకరించిన చెత్తను నిల్వ ఉంచేందుకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తూ చేపడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. ఈ డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని, జనవాసాలు, పాఠశాలలకు కనీసం రెండు కిలోమీటర్ల దూరంలోనే చెత్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు సుమారు 150 మంది గ్రామస్తులు పార్టీలకతీతంగా మహిళలు, యువకులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని పరిశీలించిన చైర్మన్, డంపింగ్ యార్డ్‌ను ఇతర ప్రాంతానికి తరలించే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించి, రెండు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల అనూష, దొడ్ల అండాలు, రాపోలు రేణుక, సుర్వి సత్తయ్య గౌడ్ మాజీ సర్పంచ్, యాట శంకరయ్య, పర్ని శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల సెట్టయ్య గౌడ్, పర్ని శ్రీధర్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, కాకులారం సంజీవరెడ్డి, ఎర్రగోని శ్రీనివాస్, మోడెపు పెంటయ్య, మోడెపు జంగయ్య, రాపోలు మల్లేష్, పెండెం లక్ష్మి, ముద్దం భారతి, ముద్దం మంజుల, బొడిగె అమృత, గంగిరెడ్డి మంజుల, కళావతి, గంగిరెడ్డి అండాలు, సుర్వి రాములు, పల్సం అంజయ్య గౌడ్, సుర్వి నరసింహ, ముద్దం మల్లయ్య గౌడ్, పందుల మనీ కుమార్, గణేష్, ముద్దం నరసింహ, పర్ని నర్సిరెడ్డి, సత్తిరెడ్డి, కోటయ్య, అంజిరెడ్డి, యాదయ్య తదితర గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విజయకేరటం
తెలుగు దినపత్రిక

# త్రివర్ణ పతాక ర్యాలీ కార్యక్రమం

**చౌటుప్పల్ ఆగస్టు 14 విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్**



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు శుక్రవారం రోజు స్కూల్, కళాశాల విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు మరియు ప్రజాప్రతినిధులతో కలిసి త్రివర్ణ పతాక ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మధ కుమార్ హాజరై విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను యువత స్మరించుకోవాలని సూచించారు. జాతీయ పతాకం మన దేశ గౌరవానికి ప్రతీక అని, ప్రతి పౌరుడు దానిని గౌరవంగా నిలబెట్టాలని తెలిపారు. దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత మరియు జాతీయ ఐక్యతా భావాలు విద్యార్థుల్లో పెంపొందాలని ఆకాంక్షించారు.ర్యాలీ మార్గమంతా విద్యార్థులు దేశభక్తి నినాదాలతో సందడి చేయగా, స్థానిక ప్రజలు వారిని అభినందించారు. త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు ఆకర్షణీయంగా పాల్గొనడంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమాన్ని ప్రశాంతంగా, క్రమబద్ధంగా మరియు ఉత్సాహభరితంగా నిర్వహించగా, పాల్గొన్న విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించి దేశానికి తమ సేవలను అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పోలీసులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ పండుగలను ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా నిర్వహించడం యువతలో దేశసేవా స్ఫూర్తిని పెంపొందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**మోడల్ స్కూల్--చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మించాలి**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ వినతి**

**చౌటుప్పల్, ఆగస్టు 14 ( విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్)**



విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 10,814 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఫీజుల పేరుతో వేధింపులకు పాల్పడుతున్న యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పెండింగ్ బకాయిల విడుదల కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కోరినట్లు తిగుళ్ళ శ్రీనివాస్ తెలిపారు.అదేవిధంగా చౌటుప్పల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నుండి చౌటుప్పల్ హైవే వరకు సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వర్షాల సమయంలో రాకపోకలు మరింత కష్టతరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని మోడల్ స్కూల్ నుండి హైవే వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమస్యను కూడా ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుర్వి అరవింద్, సాత్విక్, శ్రీశాంత్, అజయ్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

# నేడు మినిస్టర్ చేతుల మీదుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ





**నల్లగొండ ఆగస్టు 14 విజయకేరటం ప్రతినిధి**

గొల్లగూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏ ర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గొల్ల గూడ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభించనున్న దృష్ట్యా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి 2 బి హెచ్ కె ఇండ్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.కాగా గొల్లగూడ 2 బిహెచ్ కె సముదాయంలో 552 ఇండ్లు పూర్తికాగా మంత్రి వాటిని ప్రారంభించి అక్కడే లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు ,భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తో పాటు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్న గృహాలు, కాలనీ మొత్తానికి సంబంధించి ప్రారంభోత్సవ శిలాఫలకం ఏర్పాటు చేయాలని, కాలనీ మొత్తం శుభ్రంగా ఉంచాలని, కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం టెంట్లు, తాగునీరు, తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే లబ్ధిదారులకు ఇంటి ప్రొసీడింగ్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి ,గృహ నిర్మాణ శాఖ పీడీ లోకి లాల్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి,తహసీల్దార్ పరుశురాం,మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్,మాజీ జెడ్ పి టి సి గుమ్మల మోహన్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

# మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్‌నొప్పి మాత్రమే కాదు, స్వేచ్ఛగా కదిలే హక్కును కూడా ప్రభావితం చేసే సమస్య

**డా. సాయి దినేష్ తాటికొండ**

**కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, యశోద హాస్పిటల్, సికింద్రాబాద్.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఆగస్టు 14. విజయ కెరటం .**




మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ అనేది కేవలం మోకాలి నొప్పికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది క్రమంగా మన స్వేచ్ఛగా కదిలే సామర్థ్యాన్ని, రోజువారీ పనులను చేసుకునే స్వాతంత్ర్యాన్ని ప్రభావితం చేసే సమస్య అని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్కి చెందిన డాక్టర్ తాటికొండ సాయి దినేష్ తెలిపారు స్థానిక ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చాలామంది మోకాలి నొప్పిని వయసుతో వచ్చే సహజమైన సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారని . “వయసు పెరిగింది కాబట్టి మోకాళ్ల నొప్పి సహజమే” అని అనుకోవడం వల్ల చాలామంది సరైన సమయంలో వైద్యులను సంప్రదించరన్నారు.కానీ ఆస్టియో ఆర్థరైటిస్ పెరుగుతున్న కొద్దీ మెట్లు ఎక్కడం, ఎక్కువ దూరం నడవడం, కుర్చీలోంచి లేవడం, నేలపై కూర్చోవడం వంటి సాధారణ పనులు కూడా కష్టంగా మారవచ్చు. బయటకు వెళ్లడం, ప్రయాణం చేయడం, కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి విషయాల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతాయి.ఒక దశలో “నేను ఎక్కడికైనా వెళ్లాలంటే ఇతరుల సహాయం అవసరం” అనే పరిస్థితి కూడా రావచ్చు. అందుకే మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్‌ను కేవలం నొప్పిగా కాకుండా, ఒక వ్యక్తి స్వాతంత్ర్యాన్ని క్రమంగా తగ్గించే సమస్యగా చూడాలి.అయితే ఆస్టియో ఆర్థరైటిస్ వచ్చిందంటే జీవితాంతం నొప్పితోనే ఉండాల్సిన అవసరం లేదు. ప్రారంభ దశల్లో బరువు నియంత్రణ, సరైన వ్యాయామం, ఫిజియోథెరపీ, మందులు మరియు అవసరానికి అనుగుణంగా ఇతర చికిత్సల ద్వారా నొప్పిని నియంత్రిస్తూ మోకాలి పనితీరును కాపాడుకోవచ్చన్నారు.అలాగే, మోకాలి నొప్పి ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం లేదు. అదే సమయంలో తీవ్రమైన ఆర్థరైటిస్ ఉన్నవారు కూడా అవసరమైన చికిత్సను సంవత్సరాల తరబడి వాయిదా వేయాల్సిన అవసరం లేదు. ప్రతి రోగికి వ్యాధి తీవ్రత, నొప్పి, వయసు, ఆరోగ్య పరిస్థితి రోజువారీ కార్యకలాపాలపై దాని ప్రభావాన్ని బట్టి చికిత్సను నిర్ణయించాలని కొంతమంది రోగులకు నాన్-సర్జికల్ చికిత్స సరిపోతుంది. ఎంపిక చేసిన కొన్ని సందర్భాల్లో ఇంజెక్షన్లు లేదా ఇతర నొప్పి నియంత్రణ చికిత్సలు కూడా ఉపయోగపడవచ్చు. అయితే ఆర్థరైటిస్ తీవ్రంగా ఉండి, నొప్పి మోకాలి పనితీరు రోజువారీ జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్నప్పుడు, తగిన సమయంలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స గురించి ఆలోచించవచ్చన్నారు .ఆధునిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స యొక్క లక్ష్యం కేవలం ఎక్స్‌రేలో కనిపించే మోకాలిని మార్చడం కాదు. రోగికి సాధ్యమైనంత వరకు తన సాధారణ జీవితాన్ని తిరిగి అందించడం అసలు లక్ష్యం.నొప్పి లేకుండా నడవడం, మెట్లు ఎక్కడం, కుటుంబంతో కలిసి ప్రయాణించడం, రోజువారీ వ్యక్తిగత పనులను ఇతరులపై ఆధారపడకుండా చేసుకోవడం --- ఇవన్నీ చికిత్స విజయానికి ముఖ్యమైన అంశాలు.అందువల్ల, మోకాలి నొప్పిని కేవలం “వయసు వల్ల వచ్చింది” అని నిర్లక్ష్యం చేయకూడదు. నొప్పి కారణంగా నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చోవడం, నిలబడడం లేదా ప్రయాణం చేయడం కష్టంగా మారితే ఆర్థోపెడిక్ నిపుణుడిని సంప్రదించి సరైన కారణాన్ని గుర్తించుకోవాలన్నారు.మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ మీ స్వేచ్ఛను, మీ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. సరైన సమయంలో సరైన నిర్ధారణ, సరైన చికిత్స తీసుకుంటే --- మనం ఆ స్వేచ్ఛను తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

## బిజెపి విద్వేశ వైఖరి దేశానికి ప్రమాదకరం.

**నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . ఆగస్టు 14. విజయ కెరటం .**

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఇటీవల ఉత్తరాఖండ్ లోని హల్ద్వాని పట్టణంలోని రాంలీలా మైదానంలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో సభలో మాట్లాడారు.ఆ రాష్ట్రంలోని మసీదులు, దేవాలయాలు, చిన్న చిన్న దుకాణుల సముదాయ బాధితుల పక్షాన నిలబడి బిజెపి వైఖరిని తప్పుబడుతూ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు.అయితే బిజెపి రాంలీలా మైదానాన్ని శుద్ధీకరణ పేరుతో పాలతో నీళ్లతో శుభ్ర పరిచారు. ఇది దీజీపీ యొక్క “మనువాద” విభజన విద్వేషాన్ని తెలియజేస్తుంది. 80 సంవత్సరాల స్వాతంత్రం భారతదేశంలో ఇంకా ఇలాంటి కులమత విద్వేషాలను రెచ్చగొట్టడం బిజెపి సంకుచిత వైఖరిని తెలియజేస్తుంది. రాజ్యాంగం పై నమ్మకం లేని బీజేపీ మోడీ అమిత్ షా దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. ఏఐసిసి, టిపిసిసి పిలుపుమేరకు నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ నుండి డిఇఓ ఆఫీస్ ముందు ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సత్యాగ్రహ ర్యాలీ నీ నిర్వహించారు. బిజెపి కి వ్యతిరేకంగా వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ చైర్మన్ బోడ స్వామి, మండల అధ్యక్షులు చింత ధనుంజయ్, ఎడ్ల ప్రవీణ్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షులు ముంతాజ్ అలీ,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి,పోసిరెడ్డి సంతోష్ రెడ్డి దొండ రమేష్,జిల్లా కార్యదర్శులు చర్లపల్లి గౌతమ్,దంనూరి అశోక్,మూచపోతుల శ్రీనివాస్,మధు ప్రసాద్, కాటం వెంకన్న,వేముల గోపీనాథ్,వవిల్ల దేవదాస్,జమ్మూ అశోక్, తోటకూరి పరశు రాములు, కుర్పాటి గణేష్, గుడిపల్లి మహేశ్, బోడ అరుణ్,మట్టపల్లి నాగరాజు,బలం మహేష్, ఎండి అజీజ్, ఎండి ఫిరోజ్ ఖాన్,మధసు నరసింహ, బింగి మహేష్,గోలి అరవింద్,నాగార్జున, బోడ విజయ్, సూర కంపసాటి శ్రీనివాస్ యాదవ్,యాదగిరి, మల్లేష్, రాజేశ్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528